

ప్రయాణం ప్రయాసే..
బతుకమ్మ, దసరా ఉత్సవాలకు స్వగ్రామాలకు వచ్చిన వారు తిరిగి వెళ్తుండడంతో బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. 8లో



పొలాల్లో చిరుత కలకలం
జూలూరుపాడు–తల్లాడ అటవీ రేంజ్ సరిహద్దులోని పంట పొలాల్లో చిరుతపులి సంచరిస్తోందని ఆయా గ్రామాల వారు చెబుతున్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 24°

వాతావరణం
జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేడు అండర్‌-23 క్రికెట్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ -23 క్రికెట్ జట్టు ఎంపికకు మంగళవారం పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్.వెంకట్, కోఆర్డినేటర్ ఎం.డీ.మసూద్‌పాషా తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉదయం 10గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లా జట్టుకు 72 మందిని ఎంపిక చేయనుండగా, ఈనెల 18నుంచి 24 వరకు ఆరు జట్లుగా విభజించి టోర్నీ నిర్వహించాక తుది జట్టును ఖరారు చేస్తామని తెలిపారు. వివరాలకు ఎం.డీ.ఫారుఖ్(98486 62125)ను సంప్రదించాలని వారు సూచించారు.

పార్ట్ - 2 పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభం



ఎంఈఓకు పుస్తకాలు అందజేస్తున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి పార్ట్ - 2 పాఠ్య పుస్తకాల పంపిణీని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్‌లో పార్ట్ -1 పుస్తకాలు పంపిణీ చేశామని, ప్రస్తుతం పార్ట్–2 పుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని 23 మండలాల పరిధిలో గల ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఐటీడీఏ పాఠశాలలకు మొత్తం 1,43,200 పుస్తకాలను ఐదు రోజుల్లో పంపిణీ చేస్తామని తెలిపారు. పుస్తకాల రవాణాకు వాహనాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ప్రభుదయాళ్, క్రిష్ణయ్య, జిల్లా కో–ఆర్డినేటర్ నాగరాజశేఖర్, గోడౌన్ మేనేజర్ రవిప్రతాప్, ఇన్‌చార్జ్ అప్పారావు, వెంకట్, బాలు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు నేడు కౌన్సెలింగ్

కొత్తగూడెంఅర్బన్ : డీఎస్సీ– 2024లో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి, తమ కార్యాలయంలో రిపోర్ట్ చేసిన అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. అన్ని సబ్జెక్టుల అభ్యర్థులకు పాత కొత్తగూడెం మార్వాడి క్యాంపులో గల తెలంగాణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - ఆనంద ఖని)లో నేడు ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ జరిపి పాఠశాలలు కేటాయిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఫొటోతో కూడిన నియామకపత్రాన్ని తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుందని, ఖాళీల వివరాలను కౌన్సెలింగ్ హాల్ బయట ప్రదర్శిస్తామని వివరించారు.

30వరకు ప్రవేశాలకు అవకాశం

మణుగూరురూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐల్లో కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని మణుగూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ తెలిపారు. ఇటీవల ఏటీసీలుగా అప్‌గ్రేడ్ అయిన కాలేజీల్లో కొత్త కోర్సులను ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. ఆసక్తి, అర్హతలు ఉన్నవారు ఈనెల 9వ తేదీ ఉదయం 11గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మొదట సూచించగా, ఈనెల 30వ తేదీ ఉదయం 11గంటల వరకు గడువు పొడిగించారని తెలిపారు. ఈమేరకు http:// iti. telangana.gov.in వెబ్‌సైట్‌లో ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఖాకీల్లో కల్లోలం



మావోయిస్టుల ప్రభావం ఉన్న రెండు రాష్ట్రాలతో నేరుగా, మరో రాష్ట్రంతో సమీప సరిహద్దును పంచుకుంటున్న భద్రాద్రి జిల్లా.. శాంతి భద్రతల పరంగా సున్నితమైన ప్రాంతం. ఇలాంటి జిల్లాలో పని చేయడాన్ని పోలీసులు సవాల్‌గా స్వీకరిస్తారు. అయితే ఇప్పుడు ఖాకీలకు బయట నుంచి వచ్చే సవాళ్ల కంటే అంతర్గత విషయాలే అతి పెద్ద సమస్యగా మారాయనే అభిప్రాయం బలపడుతోంది. వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలు అందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

జిల్లా పోలీస్ శాఖలో ఆత్మహత్యల కలకలం

- అంతర్గత సమస్యలే బలవన్మరణాలకు కారణం
- సంచలన ఆరోపణలు చేసిన బాధితులు
- సరికొత్త సందేహాలకు తావిస్తున్న ఘటనలు

పనుల్లో భేష్..

జిల్లాకు ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా (సమీప) సరిహద్దులుగా ఉన్నాయి. దట్టమైన అడవులతో పాటు గోదావరి, కిన్నెరసాని వంటి నదులు, కేటీపీఎస్, సింగరేణి, బీటీపీఎస్ తదితర పరిశ్రమలూ ఇక్కడ ఉన్నాయి. గోదావరి వరదలు, భక్తులు, వీఐపీల తాకిడి ఎక్కువగా ఉండే భద్రాచల రామాలయమూ జిల్లాలోనే ఉంది. దీంతో ఇటు మావోయిస్టుల చొరబాట్లు, అటు గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు రోజువారీ విధులను జిల్లా పోలీసులు కొన్నేళ్లుగా సమర్థంగా చేపడుతున్నారు. బలమైన నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. నెలలో కనీసం 20 రోజులు జిల్లాలో ఏదో ఒక మూలన గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నారు. నెలకు కనీసం నలుగురు లేదా ఐదుగురు మావోయిస్టులు, వారి సానుభూతిపరులను అరెస్ట్ చేయడం లేదా వారు లొంగిపోయేలా చూస్తున్నారు. 2022 జూలైలో వచ్చిన వరదలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 71 అడుగులకు మించి ప్రవహించినా.. ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో పోలీసుల పాత్ర మరువలేనిది. అయితే ఇటీవల చోటుచేసుకుంటున్న సంఘటనలు జిల్లా పోలీసుల ప్రతిష్టను మసకబారుస్తున్నాయి.

సరికొత్త సందేహాలు

రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా విషయంలో ఆరోపణలు వచ్చిన పలువురు ఎస్సైలు, సీఐలను ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసింది. ఇందులో జిల్లా నుంచి ఒక్క పేరు కూడా రాలేదు. దీంతో జిల్లా పోలీసు విభాగంపై సదభిప్రాయం నెలకొంది. కానీ కానిస్టేబుల్ సాగర్, ఎస్సై శ్రీరాములు శ్రీనివాస్ ఆత్మహత్యలు 'ఖాకీవనం'పై సరికొత్త సందేహాలను లేవనెత్తుతున్నాయి. ఇసుక విషయంలో జీరో దందా, ఓవర్ లోడ్, బెల్ట్‌షాపుల వ్యవహారం, పట్టుకున్న గంజాయిని పక్కదారి పట్టించడం, పీడీఎస్ అక్రమ రవాణాను చూసీ చూడనట్టు వదిలేయడం వంటి వ్యవహారాల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ స్టేషన్ల వారీగా పోలీసుల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలకు అద్దం పడుతున్నాయనే అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. వామపక్ష తీవ్రవాదం పరంగా అత్యంత సున్నితమైన జిల్లాలో పోలీసు విభాగంలో లుకలుకలు ఉండడం శాంతిభద్రతల పరంగా మంచిదికాదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా కీలక స్టేషన్లలో జరుగుతున్న లోగుట్టుపై దృష్టి సారించాలనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆత్మహత్యలు.. ఆరోపణలు..

జిల్లాలో కానిస్టేబుల్‌గా పని చేసిన భూక్యా సాగర్ ఆత్మహత్య చేసుకుంటూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ఈ వీడియోలో చేసిన ఆరోపణలు జిల్లా పోలీసు విభాగంలో సంచలనంగా మారాయి. గంజాయి కట్టడి మాటున సాగుతున్న చీకటి కోణాలను సాగర్ ప్రస్తావించాడు. తనిఖీల్లో పట్టుబడిన గంజాయిని తన పై అధికారులు పక్కదారి పట్టించారని, ఈ వ్యవహారంలో తనను బలిపశువు చేశారని ఆరోపించాడు. తనపై మోపిన నిందను భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వివరించాడు. అంతకుముందు అశ్వారావుపేటలో ఎస్‌ఐగా పని చేసిన శ్రీరాములు శ్రీనివాస్ సైతం ఇదే తరహాలో పోలీస్ స్టేషన్‌లో పని చేసే తన కింది స్థాయి, పై స్థాయి అధికారులు తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ రెండు ఘటనల్లోనూ మృతులు ఎస్టీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారు కావడం గమనార్హం.

ప్రజావాణికి తగ్గిన వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): దసరా పండుగ ప్రభావంతో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి దరఖాస్తుదారులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

దరఖాస్తుల్లో కొన్నింటి వివరాలిలా..

- బూర్గంపాడుకు చెందిన గోనెల బ్రహ్మం తన సాగుభూమికి సంబంధించి పాసుపుస్తకంలో తప్పులు సరిచేయాలని దరఖాస్తు చేశానని, మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని, తహసీల్దార్ కార్యాలయంలో అడిగితే కలెక్టర్ కార్యాలయంలో ఉందని చెప్పారని, తప్పులు సరిచేసి పాస్ పుస్తకం ఇప్పించాలని దరఖాస్తు చేయగా ఈడీఎంకు ఎండార్స్ చేశారు.
- పాల్వంచ బొల్లోరిగూడెంకు చెందిన బొల్లి రవి తమకు గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు రావడం లేదని దరఖాస్తు చేయగా విద్యుత్ శాఖకు ఎండార్స్ చేశారు.
- తాను టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నానని, కుట్టు మిషన్ కొనుగోలుకు రుణం అందించాలని ఇల్లెందు మండలం సుదిమళ్లకు చెందిన డేగల నాగమణి దరఖాస్తు చేయగా ఎస్సీ సంక్షేమాధికారికి పంపించారు.
- టేకులపల్లి మండలం పానుగోతు తండాకు చెందిన భూక్య మంగి.. తన భర్త దివ్యాంగుడని, సరైన ఇల్లు లేక ఇబ్బంది పడుతున్నామని, ఇల్లు మంజూరు చేయాలని చేసిన దరఖాస్తు చేయగా హౌసింగ్ శాఖకు ఎండార్స్ చేశారు.
- మణుగూరు విఠల్‌రావు నగర్‌కు చెందిన రావుల కుమారస్వామి మణుగూరు మున్సిపాలిటీలో వాల్ ఆపరేటర్‌గా, బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహించే వాడినని, విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన ప్రమాదం జరగగా విధులకు హాజరు కాలేకపోయానని, మొన్నటి వరకు ఉద్యోగం ఇస్తామని చెప్పి ఇప్పుడు కలెక్టర్ లేదా సబ్‌కలెక్టర్ నుంచి లెటర్ తీసుకురమ్మంటూ మున్సిపల్ కమిషనర్ ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేయగా దరఖాస్తును మణుగూరు మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.

మూడోరోజూ.. అదేహోరు!

కొనసాగుతున్న కోట మైసమ్మ తల్లి జాతర



జాతర ప్రాంగణంలో భక్తుల రద్దీ

కొలిచిన వారికి కొంగుబంగారంగా నిలిచే శ్రీకోటమైసమ్మ తల్లి జాతర సోమవారం మూడో రోజుకు చేరింది. కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో కొలువుదీరిన కోటమైసమ్మ తల్లి ఆలయంలో ఏటా దసరాకు దేవాదాయ ధర్మదాయ శాఖ, పర్సా ట్రస్టు ఆధ్వర్యాన జరిగే జాతరకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని జాతర ఆవరణలోనే బస చేసి వంటావార్పు చేసుకున్నారు. ఇక చిన్నాపెద్ద తేడా లేకుండాఆటబొమ్మలు కొనుగోలు చేస్తూ జాయింట్ వీల్ ఎక్కుతూ ఉత్సాహంగా గడిపారు. కాగా, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఇల్లెందు - కారేపల్లి ప్రధాన రహదారి వద్ద ఉన్న ఆర్చ్ సమీపానే వాహనాలు పార్కింగ్ చేయాలని సూచించడంతో భక్తులు అక్కడే బైక్‌లు నిలిచారు. ఇదే అదునుగా దుండగులు పలువురి ద్విచక్ర వాహనాలను చోరీచేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. – కారేపల్లి

ఐటీడీఏ విద్యుత్ ఏపీఓగా బాధ్యతలు

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ విద్యుత్ విభాగంలో సహాయ ప్రాజెక్టు అధికారి (పవర్)గా టి. వేణు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాచలం సబ్ స్టేషన్‌లో ఏడీఈ (ఆపరేషన్)గా విధులు నిర్వహిస్తున్న వేణును ఏపీఓగా నియమిస్తూ విద్యుత్ శాఖ సీఎండీ వరుణ్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, విద్యుత్ విభాగం ఏఈ మునీర్ పాషా తదితరులు అభినందనలు తెలిపారు. ఐటీడీఏ అటవీ హక్కు చట్టం విభాగంలో ఆర్‌ఓఎఫ్ఆర్ డీటీగా(ఎఫ్‌ఏసీ) ఎం. లక్ష్మీనారాయణ సైతం బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించారు



ఏపీఓ వేణుకు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

దసరా కిక్కు @ 4.22 కోట్లు



- కిటకిటలాడిన వైన్స్, బెల్ట్ షాపులు
- అయినా గతేడాది కంటే తక్కువగానే విక్రయాలు
- గత దసరాకు రూ.5.50 కోట్ల విలువైన మద్యం అమ్మకం

పాల్వంచరూరల్ : మందుబాబులు దసరా పండుగను 'ఫుల్లు'గా ఎంజాయ్ చేశారు. దసరాకు రెండు రోజులు సెలవులు రావడంతో జిల్లాలోని మద్యం దుకాణాలన్నీ కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం ప్రియులతో సందడి నెలకొంది. కొన్ని షాపుల్లో బీర్లు లభించక ఇతర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకున్నారు. అయితే గతేడాదితో పోల్చితే ఈసారి దసరా పండగాకు మద్యం అమ్మకాలతో ప్రభుత్వానికి ఆదాయం తగ్గిందనే చెప్పాలి. జిల్లాలో 88 వైన్ షాపులు, 13 బార్ అండ్ రెస్టారెంట్లు, ఒక క్లబ్ ఉన్నాయి. ఇక బెల్ట్ షాపుల సంఖ్య లెక్కే లేదు. దసరా సందర్భంగా వైరాలోని బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా జిల్లాకు రూ.4.22 కోట్ల విలువైన వివిధ రకాల బ్రాందీ, విస్కీ కేసులు 4,850, బీర్లు 5,200 కేసులు విక్రయించామని కార్పొరేషన్ డీఎం కాశీనాథం తెలిపారు. గతేడాది దసరాకు రూ.5.50 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయిందని చెప్పారు. గత దసరాతో పోల్చితే రూ.1.28 కోట్ల మేర అమ్మకాలు తగ్గాయని పేర్కొన్నారు.

ఏపీ మద్యం టెండర్ల ప్రభావం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మద్యం టెండర్లు నిర్వహించడంతో జిల్లాకు చెందిన పలువురు వ్యాపారులు అక్కడి మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు టెండర్లు వేశారు. వారు అక్కడికి వెళ్లడంతో జిల్లాలో ఈసారి ఆశించిన మేర మద్యం అమ్మకాలు జరగలేదని అధికారులు అంటున్నారు. ఈ ఏడాది పండగ సీజన్‌లో మద్యం అమ్మకాలు అంతంత మాత్రంగానే జరిగాయని, సోమవారం ఒక్క కేసు కూడా అమ్ముడు పోలేదని తెలిపారు. ఈనెల 10, 11 తేదీల్లో మాత్రం బాగానే విక్రయించామని వారు వివరించారు.


డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు రాజుకు కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. కేయూ సీనియర్ ప్రొఫెసర్ బి.సంజీవరెడ్డి పర్యవేక్షణలో ఆయన భారత్, చైనా ఉమ్మడి శక్తిగా ఉద్భవిస్తే ప్రపంచ క్రమాన్ని మార్చేయడానికి గల అవకాశాలపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా రాజును ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నప్పయ్య సోమవారం అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.ప్రభాకర్‌రావు, పి.కృష్ణవేణి, బి.నాగేశ్వరరావు, శ్రీదేవి, రాకేష్, శ్రీరాం, వెంకటేశ్వరరావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, జి.శేఖర్, టి.రాజు, సరిత, టి.సురేందర్, ఈశ్వర్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, వై.యూ.కుమార్, లక్ష్మణ్‌రావు, సుజాత, ఇమామ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



రాజును అభినందిస్తున్న ప్రిన్సిపాల్

దాతలే ఆధారం!



భద్రాచలం దేవస్థానం వ్యూ

- మర్యాద కల్పిస్తే మరింత మంది ముందుకు..
- రామాలయంలో వారి కోసం ప్రత్యేక శాఖ అవసరం
- చెంతనే సింగరేణి, ఐటీసీ ఉన్నా సాయం శూన్యం
- దాతలకు దేవస్థానం ఆధ్వర్యంలో నేడు సత్కారం

భద్రాచలం : ఏకపత్నీవ్రతుడు.. తండ్రి మాట జవదాటని తనయుడైన శ్రీరాముడిని ప్రతీ భక్తుడు ఎంతో ప్రత్యేకంగా కొలుస్తారు. తమ ఇష్ట దైవంగా, ఇంటి ఇలవేల్పుగా కొలిచే వారిలో తిరుపతి వేంకటేశ్వరస్వామి తర్వాత స్థానం రామయ్యదే. విశిష్ట స్థల పురాణం, వైకుంఠం నుంచి సీతాలక్ష్మణ సమేతుడై భద్రగిరిపై కొలువైన భద్రాద్రి రాముడికి దేశవ్యాప్తంగా ఎంతో మంది భక్తులు ఉన్నారు. స్వామివారి దర్శనానికి తెలంగాణ, ఏపీతో పాటు అన్ని రాష్ట్రాల నుంచి తరలివస్తుంటారు. ఇంతటి ప్రఖ్యాతి గాంచిన భద్రాచలం దేవస్థానానికి పలు రూపాల్లో విరాళాలు అందజేసిన దాతలను మంగళవారం సత్కరించనున్నారు. ఈ నేపథ్యంలో దాతలు పెరిగేలా తీసుకోవాల్సిన చర్యలు, వారికి కల్పించాల్సిన మర్యాదలను పరిశీలిద్దాం..

భారీ విరాళాల సేకరణలో విఫలం..

భద్రాద్రి రామయ్యకు భక్తులు వారికి తోచిన రీతిలో బంగారం, వెండితో పాటు శాశ్వత నిత్యాన్న దానానికి నగదు విరాళంగా అందిస్తున్నారు. అంతకుమించి భారీ విరాళాల సేకరణలో ఆలయ అధికారులు విఫలమయ్యారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దేవస్థానానికి వచ్చే భక్తులను దాతలుగా మార్చడంలో వారు తీసుకుంటున్న చర్యలు శూన్యమనే చెప్పాలి. దేవస్థానం వద్ద రసీదు కౌంటర్‌ను ఏర్పాటు చేయడంతోనే చేతులు దులుపుకుంటున్నారని, అలా కాకుండా దేవస్థాన ప్రాంగణంలో దాతలకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి, భక్తులను దాతలుగా మార్చేలా ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు. ఆలయ అభివృద్ధికి చేపడుతున్న ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ అవసరమైన నిధులు, వాటి వినియోగంపై అవగాహన కల్పించాలని అంటున్నారు.

సింగరేణి, ఐటీసీల సాయమే లేదు..

దేశంలో ఏ ఆలయం అభివృద్ధి చెందాలన్నా ప్రముఖ కార్పొరేట్ సంస్థలు, ప్రైవేట్ కంపెనీలే కీలక పాత్ర పోషిస్తుంటాయి. ఆయా సంస్థల సీఎస్సార్ నిధులను కొంత ఆలయాలకు కేటాయిస్తుంటాయి. ఇలాంటి పెద్ద సంస్థల వారిని భద్రాచలం వైపు చూసేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని భక్తులు అంటున్నారు. ఆయా సంస్థల ప్రతినిధులు, చైర్మన్లను ఆలయానికి రప్పించగలిగితే అభివృద్ధిపై వారి చూపు పడే అవకాశం ఉంది. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లా పారిశ్రామికంగా రాష్ట్రంలోనే పేరుగాంచింది. ఖమ్మంలో గ్రానైట్, మార్బుల్స్ రంగం కీలకంగా ఉండగా, భద్రాద్రి జిల్లా బొగ్గు గనులకు కేంద్రంగా సింగరేణి, పాల్వంచలో నవ భారత్, కేటీపీఎస్, సారపాకలో ఐటీసీ, పినపాక మండలంలో బీటీపీఎస్ వంటి ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు ఉన్నాయి. ఇవన్నీ జిల్లాలోని వనరులపై ఆధారపడే మనుగడ సాగిస్తున్నాయి. ఇప్పటివరకు ఈ కంపెనీలు ఆలయ అభివృద్ధిపై దృష్టి పెట్టిన ఘటనలు లేనే లేవు. ప్రధానంగా సింగరేణి, ఐటీసీ సంస్థల నుంచి విరాళాలు సేకరించగలిగితే భద్రాచలం మరో తిరుపతి కావడం ఖాయమని భక్తులు చెబుతున్నారు.

దాతలకు వేదాశీర్వచనం చేస్తే..

దాతలు అందించే విరాళాలు దుర్వినియోగమైన ఘటనలు దేవస్థానంలో గతంలో చోటుచేసుకున్నాయి. ఇలాంటివి జరగకుండా కఠినచర్యలు తీసుకోవాలి. దాతలు అందజేసిన సౌకర్యాలు, వసతులపై దేవస్థానం పర్యవేక్షణ ఉండాలి. ఇక ముఖ్యంగా ఆలయానికి వచ్చిన దాతలకు మరింతగా మర్యాద లభించేలా చర్యలు తీసుకోవాలి. నిర్దిష్ట విరాళం అందజేసిన దాతలకు ఆలయంలోనే స్వామి వారి కండువా, ప్రసాదంతో పాటు వేదాశీర్వచనం చేస్తే వారికి కలిగే సంతృప్తి అంతా ఇంతా కాదు. ఈ మేరకు చర్యలు చేపట్టాలి. ఆలయ ఈఓగా రమాదేవి బాధ్యతలు స్వీకరించాక గతేడాది రూ.లక్ష, అంతకుమించి విరాళం అందించిన దాతలను ఆహ్వానించి సత్కరించారు. ఇక మంగళవారం కూడా దాతలను సత్కరించేందుకు ఆహ్వానాలు అందించారు. ఈ నేపథ్యంలో భక్తుల, దాతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, ఆలయాభివృద్ధిలో ఎక్కువ మందిని భాగస్వామ్యం చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆలయ ఆదాయమే ప్రధాన వనరు..

భద్రగిరిపై నిలువ నీడ లేకుండా ఉన్న రాముడి విగ్రహాలకు హస్నాబాద్ (పాల్వంచ) తహసీల్దారైన కంచర్ల గోపన్న 17వ శతాబ్దంలో ఆలయ ప్రధాన గోపురాన్ని నిర్మించాడు. స్వామి, అమ్మవార్లకు ఆభరణాలూ చేయించారు. ఆ తర్వాత నిజాం ప్రభువు తానీషా తమ సర్కార్ తరపున రామయ్య కల్యాణానికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. దీంతో అప్పట్లోనే భద్రాచలానికి ప్రత్యేకత ఏర్పడగా.. నాటి నుంచి అన్ని ప్రభుత్వాలూ ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నాయి. ఇక శ్రీ సీతారాముల కల్యాణానికి దేశ వ్యాప్తంగా ప్రాచుర్యం లభించడంతో భక్తుల రాక పెరుగుతోంది. ఈ క్రమంలో ఆలయ అభివృద్ధికి దాతలు ధన, వస్తు, భూమి తదితర రూపాల్లో విరాళాలు అందిస్తున్నారు. ఇలా నాడు దాతలు అందజేసిన భూములు రెండు వేల ఎకరాలకు పైగానే ఉన్నాయి. అయితే ఇన్ని ఉన్నా.. ఆలయ అభివృద్ధికి నిత్యం వచ్చే ఆదాయమే ప్రధాన వనరుగా ఉంటోంది. సిబ్బంది జీతభత్యాలు, ఉత్సవాలకు ఇందులో నుంచే వెచ్చించాల్సి రావడంతో ఆదాయానికి సమానంగా ఖర్చులు ఉంటున్నాయి. దీంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

క్లుప్తంగా

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈమేరకు ఉదయం 10–30గంటలకు మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమాయగూడెంలో జరిగే నూకల నరేష్‌రెడ్డి దశదినకర్మలో పాల్గొననున్న మంత్రి పొంగులేటి, మధ్యాహ్నం 2–45 గంటలకు బూర్గంపాడు మండలం తాళ్లగొమ్మూరులో గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ నూతన భవనాన్ని ప్రారంభిస్తారు. ఆతర్వాత మణుగూరులో బాలి కల ఆశ్రమ ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనుండగా, సాయంత్రం 4గంటలకు పీ.వీ.కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో మణుగూరు నియోజకవర్గ అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి నలుగురి ఎంపిక



రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారిణిలు

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల జరిగిన సీనియర్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో ప్రతిభ చాటిన జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారిణిలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఇందులో అఖిల, శ్రీలక్ష్మి(వీవీపాలెం), కావ్య(ఖమ్మం), అలేఖ్య(పాల్వంచ) ఉండగా, వీరు ఈనెల 19నుంచి పశ్చిమబెంగాల్ రాష్ట్రం సిలిగురిలో జరగనున్న జాతీయ సీనియర్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీలో రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీఆకారులను ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సెల్యూకాస్, కె.ఆదర్శ్‌కుమార్ అభినందించారు. కాగా, రాష్ట్ర జట్టుకు కోచ్ కం మేనేజర్‌గా ఖమ్మంలోని హార్వెస్ట్ స్కూల్ పీఈటీ మాధురి వ్యవహరించనున్నారు.

వెట్‌రన్ సక్సెస్ !



డెలివరీ పంప్‌హౌజ్ వద్ద నీరు ఎత్తిపోస్తున్న మోటార్

కూసుమంచి: మండలంలోని ఎర్రగడ్డ తండా వద్ద భక్తరామదాసు ఎత్తిపోతల పథకం మోటార్లు ఇటీవల వరదలో మునిగిపోగా మరమ్మతులు చేయిస్తున్నారు. ఇందులో ఒక మోటార్ మరమ్మతులు పూర్తికావడంతో ఇటీవల ట్రయల్ రన్ చేయగా, సోమవారం వెట్ రన్ నిర్వహించారు. ఇది విజయవంతం కావడంతో తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం వద్ద ఉన్న డెలివరీ పంప్ హౌజ్‌లోకి నీటిని ఎత్తిపోసింది. ప్రస్తుతం నీటి అవసరం పెద్దగా లేదని, రైతులకు సాగునీరు అవసరమైతే మోటార్ నడిపించేలా సిద్ధం చేశామని డీఈఈ రమేష్‌రెడ్డి తెలిపారు. మరో మోటార్ మరమ్మతులు కూడా చివరి దశలో ఉన్నాయని వెల్లడించారు.


చికిత్స పొందుతున్న యువకుడు మృతి

ఖమ్మం క్రైమ్: అనారోగ్యంతో బాధపడుతూ గడ్డి మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఖమ్మం త్రీ టౌన్ సీఐ రమేశ్ తెలిపిన వివరాలు... ఖమ్మం శ్రీనివాసనగర్‌కు చెందిన గంటల నర్సింహాచారి కుమారుడు ధనుంజయాచారి(24) బాల్యం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్థాపం చెందిన ఆయన గతనెల 26న గడ్డి మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఘటనపై ఆయన తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ములకలపల్లి : పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని విజయపురి కాలనీలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి, ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి నుంచి రూ.1,900 స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని తెలిపారు. దాడి చేసిన వారిలో కానిస్టేబళ్లు తిరుపతి, ప్రసాద్ ఉన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

ప్రయాణం ప్రయాసే..



బస్సులు లేక వేచి ఉన్న ప్రయాణికులు



ఆటోలో బయలుదేరేందుకు సిద్ధమవుతున్న ప్రయాణికులు



బస్సుల కోసం చెట్ల కింద నిరీక్షిస్తూ...



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్

- పండుగ అనంతరం పట్టణాలకు తరలుతున్న పలువురు
- బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షణ
- కిటకిటలాడిన ఇల్లెందు బస్టాండ్
- బస్సులు సరిపోక ప్రైవేట్ వాహనాలకు డిమాండ్

ఇల్లెందు: బతుకమ్మ, దసరా ఉత్సవాల కోసం సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన ఆడపడుచులు, కొత్త అల్లుళ్లు, విద్యార్థులు, టీచర్లు, ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు తిరుగు ప్రయాణం అయ్యారు. వారు పనిచేసే కార్యాలయాలకు, ఆడబిడ్డలు అత్తవారింటికి బయలుదేరారు. ఇలా పెద్ద సంఖ్యలో ఒకేసారి రావడంతో ఇల్లెందు బస్టాండ్‌లో రద్దీ విపరీతమైంది. దీనికి తోడు కోటమైసమ్మ జాతర భక్తుల రాకపోకల ప్రభావం కూడా పడింది. దీంతో సోమవారం బస్టాండ్‌లో ఇసుక వేస్తే రాలనంతగా ప్రయాణికులు కిక్కిరిసిపోయారు. తెల్లరుజామునుంచే బస్సులు కిటకిటలాడాయి. ముఖ్యంగా గుండాల, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం వైపు వెళ్లే బస్సులకు మధ్యలో స్టాప్‌లు ఉన్నా బస్టాండ్‌లోనే నిండడంతో ఎక్కడా ఆపకుండా వెళ్లిపోయారు. ఇక ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు సరిపడా బస్సులు ఏర్పాటు చేయకపోవటంతో పలువురు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. కాగా, ఆర్టీసీ అధికారుల వైఫల్యంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారని సీపీఎం నాయకుడు ఎస్‌ఏ.నబీ ఆరోపించారు. ఇల్లెందు బస్టాండ్‌లో గంటల కొద్దీ వేచి చూసినా పట్టించుకునే వారు కరువయ్యారని తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్
- సాగర్ మృతదేహం వద్ద నివాళులర్పించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్



నివాళులర్పిస్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్

ఏన్కూరు: గంజాయి కేసులో తనపై తప్పుడు కేసులు బనాయించారనే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ సాగర్ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆయన కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ వెల్లడించారు. ఈనెల 12న ఏన్కూరు సాగర్ ప్రధాన కాల్వ సమీపాన పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సాగర్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని సోమవారం స్వగ్రామమైన ఏన్కూరుకు తీసుకురాగా ఎమ్మెల్యే రాందాస్ నివాళులర్పించి మాట్లాడారు.

బందోబస్తు మధ్య అంతిమయాత్ర

కానిస్టేబుల్ సాగర్ మృతదేహాన్ని ఏన్కూరుకు తీసుకొస్తున్నారని తెలియడంతో గిరిజన సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ఈ మేరకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తు మధ్యే సాగర్ మృతదేహాన్ని ఇంటికి తరలించగా బంధువులు, స్నేహితులు, కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ కానిస్టేబుల్ మృతదేహం వద్ద నివాళులర్పించి తక్షణ సాయంగా రూ.1.20 లక్షలు అందజేశారు. సాగర్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోలీసు బందోబస్తు నడుమ అక్కినాపురం తండాలోని కానిస్టేబుల్ వ్యవసాయ క్షేత్రానికి తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి చొరవ

- అంగన్‌వాడీ భవన నిర్మాణాలు పూర్తిచేయాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం: గ్రామాల్లో ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణ సమయాన తగిన జాగ్రత్తలు తీసుకుంటే పది కాలాల పాటు ఇబ్బంది ఉండదని తెలిపారు. ఈ విషయంలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గుడిసెలు, రేకుల షెడ్లలో ఉంటున్న వారి వివరాలు అందజేస్తే వారికి అర్హత మేరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. రఘునాథపాలెం మండలంలో పోడు పట్టాలు పొందిన గిరిజన రైతుల పొలాల్లో బోర్లకు విద్యుత్ కనెక్షన్లు జారీచేయాలని, మిగిలిన వారికి పోడు భూముల పంపిణీకి చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమం, విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. కాగా, మండలంలో పెండింగ్ ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేలా అవసరమైన నిధులు కేటాయిస్తామని మంత్రి వెల్లడించారు. ఇక రైతులు రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాలు చెల్లిస్తే ప్రభుత్వం మిగతాది మాఫీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ డీఈ యు.మహేష్‌బాబు, ఏఈ చిరంజీవి, ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డితో పాటు నాయకులు మానుకొండ రాధాకిషోర్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, మద్దీదు జగన్, గుత్తా వెంకటేశ్వర్లు, మంగీలాల్‌నాయక్, భూక్యా లాలు, బండి వెంకన్న, మారం కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో చిరుత అడుగుల కలకలం



పొలంలో పాదముద్రలు



చిరుత అడుగు జాడలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

జూలూరుపాడు: జూలూరుపాడు - తల్లాడ అటవీ రేంజ్ సరిహద్దు ప్రాంతంలోని మున్యాతండా, భద్రుతండా గ్రామాల సమీపంలోని పంట పొలాల్లో చిరుత పులి సంచరిస్తోందని గ్రామస్తులు అంటున్నారు. పొలాల్లో చిరుత అడుగు జాడలు కనిపించాయంటూ స్థానికులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు సోమవారం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు, సెక్షన్ అధికారి ఎం.హనుమంతు, బీట్ ఆఫీసర్ జె. అనిత అక్కడికి చేరకుని పాదముద్రలను పరిశీలించారు. అవి చిరుతకు సంబంధించిన గుర్తులేనని ఎఫ్‌ఆర్‌ఓ అనుమానం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలూరుపాడు, తల్లాడ అటవీ రేంజ్ సరిహద్దు ప్రాంతాల్లోని పొలాల్లో చిరుత అడుగుజాడలు కనిపించాయనే సమాచారం మేరకు పరిశీలించామని, పాదముద్రలు చిరుతకు చెందినవేనని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. రైతులు, కూలీలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గొర్రెలు, పశువుల కాపరులు జాగ్రత్త వహించాలని సూచించారు. పొలాలు, అటవీ ప్రాంతాల్లోకి ఒంటరిగా వెళ్లవద్దని, మున్యాతండా, భద్రుతండా, భీమ్లాతండా గ్రామాల ప్రజలు రాత్రి వేళ ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించారు. చిరుత సంచారం కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కాగా, మున్యాతండాలో ఓ రైతు పొలం వద్ద కాపలా కోసం కుక్కను కట్టేసి ఉంచగా, చిరుత దాన్ని కొంతదూరం ఈడ్చుకుని వెళ్లిందని స్థానికులు చెబుతున్నారు.

సీఎంఆర్‌లో బహుమతుల పండుగ

ఖమ్మంగాంధీచౌక్: సీఎంఆర్ షాపింగ్‌మాల్ యాజమాన్యం దసరా, దీపావళి పండుగల సందర్భంగా గతనెల 19నుంచి 'ది బిగ్గెస్ట్ ఫెస్టివ్ ధమాకా' నిర్వహించింది. ఈసందర్భంగా ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట, మిర్యాలగూడ, ఉప్పల్, హన్మకొండ, షాద్‌నగర్, హయత్‌నగర్, బీహెచ్‌ఈఎల్, కరీంనగర్ సీఎంఆర్ షాపింగ్ మాళ్లలో ప్రతీ రూ.500 కొనుగోలుపై లక్కీ డ్రా కూపన్ అందించారు. వీటి ద్వారా గంటగంటకు, వారానికోసారి బహుమతులు ప్రకటించడమేకాక దసరా, దీపావళికి మారుతీ ఆల్టో కే–10 కార్లను బహుమతులుగా ఇస్తామని వెల్లడించారు. ఇందులో భాగంగా దసరా నాటికి గంటగంటకు లక్కీ డ్రాలో 2వేల మందికి పైగా బహుమతులు గెలుపొందారని, ఇంకా డైలీ, వీక్లీతో దీపావళి బంపర్ డ్రాలో మరిన్ని బహుమతులు గెలిచే అవకాశముందని సీఎంఆర్ షాపింగ్ మాల్ జనరల్ మేనేజర్ నూలు లింగమూర్తి తెలిపారు. కాగా, దసరా డ్రాలో షోరూంల వారీగా మారుతి ఆల్టో కే–10 గెలుచుకున్న విజేతల వివరాలను వెల్లడించారు. కొత్తగూడెం షోరూం నుంచి అబీదున్నీస్సా బేగం, ఖమ్మంలో మహేష్, సూర్యాపేటలో అచ్యుత, మిర్యాలగూడలో సంధ్య, ఉప్పల్‌లో వీరయ్య, హన్మకొండలో నితిన్, షాద్‌నగర్ నుంచి రాజు, హయత్‌నగర్‌లో కవిత, బీహెచ్‌ఈఎల్‌లో మౌనిక, కరీంనగర్ షోరూం నుంచి బి.సంపత్ విజేతలుగా నిలిచారని తెలిపారు.

బ్యాంక్ అకౌంట్ హోల్డ్‌లో పెట్టారని..

పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఏపీజీవీబీ ఎదుట సుజాత, వెంకటేశ్వర్లు దంపతులు

ములకలపల్లి : తమకు బ్యాంక్‌లో ఎలాంటి రుణం లేకున్నా, తన భార్య అకౌంట్ హోల్డ్‌లో పెట్టడంతో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా.. స్థానికులు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామ ఏపీజీవీబీ ప్రాంగణంలో సోమవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని మొటూగూడెం గ్రామానికి చెందిన బుడిపుడి సుజాతకు జగన్నాథపురం ఏపీజీవీబీలో ఖాతా ఉంది. అందులో నుంచి నగదు డ్రా చేసేందుకు సుజాత, ఆమె భర్త వెంకటేశ్వర్లు బ్యాంక్‌కు వచ్చారు. కాగా, సుజాత అకౌంట్ హోల్డ్‌లో పెట్టామని, డబ్బులు ఇవ్వడం కుదరదని బ్యాంక్ అధికారులు చెప్పడంతో వారు కంగుతిన్నారు. బ్యాంక్ అధికారులతో వాగ్వాదానికి దిగి నా ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్వర్లు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడ ఉన్నవారు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. ఇదిలా ఉండగా, వివాదం జరిగిన వెంటనే సుజాత అకౌంట్‌ను హోల్డ్ నుంచి తొలగించడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ బి.రమేష్‌ను సాక్షి వివరణ కోరగా.. డ్వాక్రా గ్రూప్‌నకు సంబంధించి సదరు మహిళ గ్రూపు లింకేజీలో రుణం ఉన్నట్లు గ్రామదీపిక తెలిపిందని, దీంతో అకౌంట్ హోల్డ్‌లో పెట్టామని చెప్పారు. కాగా, శ్రీనిధి రుణం మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు తేలడంతో హోల్డ్ నుంచి తొలగించామని తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

అశ్వారావుపేటరూరల్: తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మండల కేంద్రంలోని బీఎస్‌ఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న వి.మురళి దసరా పండుగ నేపథ్యంలో రెండు రోజుల క్రితం కుటుంబ సమేతంగా అచ్యుతాపురం గ్రామంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి తలుపు తెరిచి ఉండటంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలోని మూడు కాసుల బంగారు హారం, ముప్పావు కిలో వెండి వస్తువులు, చీరలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని బాధితులు వాపోయారు. ఎస్సై యయాతి రాజు సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి, కొత్తగూడెం నుంచి క్లూస్ టీం రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని ఎస్సై తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం పాత బస్టాండ్‌కు వచ్చిన ఓ మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. నేలకొండపల్లి మండలం చెరువు మాదారానికి చెందిన కోటమ్మ తన కుమార్తెను చూసేందుకు సోమవారం ఖమ్మం వచ్చింది. శ్రీరామ్‌హిల్స్‌లో కూతురును చూసి తిరిగి పాత బస్టాండ్‌కు చేరుకోగా బస్సు ఎక్కే సమయాన కోటమ్మ మెడలో మూడు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

గిరిజన రైతులకు సబ్సిడీపై మోటార్లు

- మాజీ మంత్రి జలగం ప్రసాదరావు వెల్లడి
- చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో దరఖాస్తుల స్వీకరణ



దుమ్ముగూడెం మండలం బండిరేవులో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాదరావు

చర్ల/దుమ్ముగూడెం : తన తండ్రి, మాజీ సీఎం జలగం వెంగళరావు పేరిట ఏర్పాటుచేసిన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గిరిజన రైతులకు సబ్సిడీపై విద్యుత్ మోటార్లు అందిస్తున్నామని మాజీ మంత్రి జలగం ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో పర్యటించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు 50 శాతం సబ్సిడీపై విద్యుత్ మోటార్లను అందజేస్తున్నామని చెప్పారు. గతేడాది చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో 400 మంది రైతులకు మోటార్లు అందజేశామని, ఈ సంవత్సరం మరో 1000 మందికి అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. చర్ల మండలం కుర్నపల్లి, బోదనెల్లి, ఎర్రబోరు, తిప్పాపురం, ఉయ్యాలమడుగు, ఉంజుపల్లి, వద్దిపేట, పూసుగుప్ప, దుమ్ముగూడెం మండలం పైడిగూడెం,చింతకుప్ప, జిన్నెలగూడెం, కమలాపురం, బండారిగూడెం గ్రామాల రైతుల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు. తన తండ్రి జలగం వెంగళరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్ నిర్మించారని, దీంతో చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో బీడులన్నీ సాగు భూములుగా మారాయని చెప్పారు. అయితే మారుమూల గ్రామాలకు తాలిపేరు ప్రాజెక్టు నుంచి నీరు ప్రవహించే అవకాశం లేనందున ఆయా ప్రాంతాల్లో బీడు భూములకు నీటి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. గిరిజన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో హైకోర్టు న్యాయవాది సి.వి. సతీష్‌కుమార్, ఎలక్ట్రికల్ ఏఈ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, శ్రీనివాస రాజు, అక్బర్,శివ, కిరణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

దుమ్ముగూడెం : మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన మట్టా వీరయ్య (45) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటనపై సోమవారం స్టేషన్‌లో కేసు నమోదైంది. వీరయ్య ఆదివారం గౌరారం గ్రామంలోని అక్క ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి పొలానికి మందు కొట్టి వస్తానంటూ వెళ్లి.. మధ్యాహ్నం గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో లోతు తెలియక చెరువులో పడి ఊపిరి ఆడక మృతిచెందాడు. సాయంత్రం వరకు వీరయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించగా ఆదివారం రాత్రి చెరువులో మృతదేహం లభ్యమైంది. దీంతో కుటుంబసభ్యులు సోమవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

గానుగపాడులో మరో యువకుడు..

చండ్రుగొండ : మండలంలోని గానుగపాడులో పద్దం చంటి (29) అనే యువకుడు చెరువులో మునిగి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామంలోని నల్లచెరువులో చేపల వేట కోసం చంటి, మరో ఇద్దరు దిగారు. చెరువులో లోతుగా ఉన్న ప్రాంతానికి వెళ్లిన చంటి.. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. గమనించిన మిగితా ఇద్దరు సమాచారం అందించడంతో గ్రామస్తులు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు.

అప్పటికే చంటి మృతిచెందగా, పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

‘ముఖ్య’నేత మాటే ఫైనల్..
మాఫియాదే రాజ్యం

ఎల్లో సిండికేట్‌కే మద్యం దుకాణాల కేటాయింపు

లాటరీ ప్రక్రియను హైజాక్ చేసిన పచ్చ మురాలు

- ఏకపక్షంగా 80 శాతం మద్యం షాపుల లైసెన్సులు హస్తగతం
- బెదిరింపులతో మిగతా 20% లైసెన్సులు కబ్జా
- ఈ అక్రమాలకు వత్తాసు పలికిన అధికార యంత్రాంగం
- మహిళల పేరుతో 345 మద్యం షాపుల లైసెన్సులు
- మొత్తం 3,396 దుకాణాలు టీడీపీ సిండికేట్ గుప్పిట్లోనే

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అప్పుడు ఆమోదం.. ఇప్పుడు రాజకీయమా ?

- దామగుండం ప్రాజెక్ట్‌ను కేటీఆర్ వ్యతిరేకించడంపై ప్రభుత్వవర్గాల మండిపాటు

సాక్షి, హైదరాబాద్: అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రంగారెడ్డి జిల్లా పూడూరులో వీఎల్‌ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపిన విషయాన్ని ప్రభుత్వ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. దామగుండం రిజర్వు ఫారెస్ట్‌లో 1174 హెక్టార్ల భూమిని ఈ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు బదిలీ చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2017 డిసెంబర్ 12న జీవో నెం.44 జారీ చేసిన విషయాన్ని ప్రస్తావిస్తున్నాయి. అయితే ఇప్పుడు మాజీమంత్రి కేటీఆర్ వ్యతిరేకించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్టును వ్యతిరేకించడం, ముందుగా ఆమోదించి ఇప్పుడు రాజకీయం చేయటం కేటీఆర్ నిజస్వరూపాన్ని తెలియజేస్తోందని మండిపడుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశ భద్రత ప్రాధాన్యం దృష్ట్యా ఈ ప్రాజెక్టుకు మద్దతునిచ్చారని పునరుద్ఘాటించాయి. 2017 మార్చి 2న నేవీ విభాగం రాష్ట్ర అటవీశాఖకు పంపిన డిమాండ్ నోటీసు ప్రకారం రూ.133.54 కోట్లు ఖాతాలో జమ చేసిందని, 2017 డిసెంబర్ 19న రాష్ట్ర ప్రభుత్వం అటవీ భూములను నేవీకి బదిలీ చేస్తూ జీవో నెం.44 జారీ చేసిన విషయాన్ని గుర్తుచేశాయి. 2017 డిసెంబర్ 22న తుది అనుమతులకు సంబంధించిన జీవో సంబంధిత జిల్లా అటవీ అధికారికి చేరిందని తెలిపాయి.

కేడర్ వివాదం మళ్లీ క్యాట్‌కు..

ఐఏఎస్‌లు ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్, జి.సృజన పిటిషన్లు

కేంద్రం నిర్ణయం హైకోర్టు తీర్పుకు విరుద్ధమని వెల్లడి • నేడు విచారణ చేపట్టనున్న క్యాట్ ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో తలెత్తిన ఆలిండియా సర్వీస్ (ఏఐఎస్) అధికారుల కేటాయింపు వివాదం మళ్లీ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)కు చేరింది. కేడర్ కేటాయింపుల మేరకు ఎక్కడి వారక్కడ విధుల్లో చేరాలని కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల విభాగం (డీవోపీటీ) ఆదేశించడాన్ని సవాల్ చేస్తూ ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి కాట, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్, జి.సృజన క్యాట్‌లో సోమవారం వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఐదు పిటిషన్లపై మంగళవారం లతా బస్వరాజ్ పట్నే (జ్యుడీషియల్), షాలినీ మిశ్రా(అడ్మినిస్ట్రేషన్) ధర్మాసనం విచారణ చేపట్టనుంది. తమను ఏపీ కేడర్‌కు బదులుగా తెలంగాణ కేడర్‌కు కేటాయించాలన్న ఏడుగురు ఐఏఎస్, ఇద్దరు ఐపీఎస్ అధికారుల విజ్ఞప్తులను తిరస్కరిస్తూ కేంద్రం గత వారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా తమను తెలంగాణ కేడర్‌కు బదులు ఏపీ కేడర్‌కు కేటాయించాలన్న మరో ముగ్గురు ఐఏఎస్ అధికారుల విజ్ఞప్తులనూ తిరస్కరించింది. తక్షణమే ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్ర కేడర్ నుంచి రిలీవ్ కావాలని, ఈనెల 16లోగా కేటాయించిన రాష్ట్రంలో రిపోర్టు చేయాలని వారిని ఆదేశించింది. అయితే, కేంద్రం నిర్ణయం హైకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉందంటూ అధికారులు మరోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. తమను తెలంగాణలోనే కొనసాగించాలని ఆమ్రపాలి కాట, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్ కోరుతుండగా, తనను ఏపీలోనే విధులు నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని సృజన కోరుతున్న విషయం విదితమే.

పదేళ్లుగా వివాదం

2014లో ఉమ్మడి ఏపీ విభజన సమయంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. విభజన సమయంలో ఏపీకి కేటాయించిన అధికారుల్లో కొందరు క్యాట్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్ తెలంగాణలో విధులు నిర్వహించేలా ఆదేశాలిచ్చింది. క్యాట్ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తప్పుబడుతూ.. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో తెలంగాణ సీఎస్‌గా పని చేస్తున్న సోమేశ్‌కుమార్‌ను ఏపీకి వెళ్లాల్సిందేనంటూ ఇదే హైకోర్టు సీజే ధర్మాసనం 2023, జనవరిలో తీర్పునిచ్చింది. అయితే కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా తమ పిటిషన్లను విడిగా విచారించాలని డీజీపీ అంజనీకుమార్ సహా ఇతర అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేసింది. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన ద్విసభ్య ధర్మాసనం.. ఈ వివాదంలో నిర్ణయం తీసుకునే బాధ్యతను డీవోపీటీకి అప్పగిస్తూ 2024, జనవరి 3న కీలక తీర్పు వెలువరించింది. అయితే అధికారుల అభ్యంతరాలను పరిశీలించాలని, స్థానికత, 10 ఏళ్ల సర్వీస్, ఇంకా మిగిలి ఉన్న సర్వీస్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది. దీంతో కేంద్రం ఏర్పాటు చేసిన దీపక్ ఖండేకర్‌కమిటీ అధికారుల విజ్ఞప్తులను పరిశీలించి.. వాటిని తోసిపుచ్చుతూ ఎక్కడి వారు అక్కడికే వెళ్లాలని నివేదిక ఇచ్చింది. కేంద్రం ఆ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీన్ని అధికారులు తాజాగా క్యాట్‌లో సవాల్ చేశారు.

సీఎస్ శాంతికుమారితో భేటీ

మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్.. సోమవారం సచివాలయంలో ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిశారు. కేంద్ర ఉత్తర్వులు, క్యాట్‌లో పిటిషన్ల నేపథ్యంలో వీరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

ఓ వైపు మరణ శాసనం..
మరోవైపు సుందరీకరణా?

- వీఎల్‌ఎఫ్ రాడార్ స్టేషన్‌తో మూసీ నది అంతర్ధానం: కేటీఆర్
- పదేళ్లు ఒత్తిడి తెచ్చినా మేము నిర్మాణానికి అంగీకరించలేదు
- ద్వీపాల్లో ఉండాల్సిన రాడార్ స్టేషన్ తెలంగాణలోనా?
- ఏం ఆశించి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారు?
- పర్యావరణవేత్తలతో కలిసి ఉద్యమిస్తాం



సాక్షి, హైదరాబాద్: నౌకాదళానికి చెందిన రాడార్ స్టేషన్ ఏర్పాటు పేరిట ఓ వైపు మూసీ నదికి మరణం శాసనం రాస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోవైపు సుందరీకరణ పేరిట హడావుడి చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. వీఎల్‌ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ నది అంతర్ధానమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పదేళ్లు తమ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినా రాడార్ స్టేషన్ నిర్మాణానికి అంగీకరించలేదన్నారు. పర్యావరణానికి హాని కలిగించే రాడార్ స్టేషన్ నిర్మాణాన్ని బీఆర్‌ఎస్ వ్యతిరేకిస్తుందన్నారు. రాడార్ స్టేషన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలతో కలిసి పోరాటం చేస్తామని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేటీఆర్ ప్రకటించారు.

ప్రమాదంలో మూసీ నది

‘వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నౌకాదళానికి సంబంధించిన వీఎల్‌ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ నది ప్రమాదంలో పడుతుంది. ఓ వైపు మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడతామంటూనే.. మరోవైపు రాడార్ స్టేషన్ నిర్మాణానికి అనుమతి ఇవ్వడం రేవంత్ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఏం ఆశించి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారో సీఎం చెప్పాలి. ఈ నెల 15న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేయడంపై బీఆర్‌ఎస్ నిరసన తెలుపుతుంది. దామగుండంలో రాడార్ స్టేషన్ ఏర్పాటుతో 2,900 ఎకరాల అటవీ భూమి, 12 లక్షల చెట్లను నష్టపోతాం. జనావాసాలు లేని ద్వీపాల్లో ఏర్పాటు చేయాల్సిన రాడార్ స్టేషన్‌ను తెలంగాణలో ఎందుకు నిర్మిస్తున్నారో చెప్పాలి’ అని కేటీఆర్ అన్నారు.

మూసీ నది ఎకో-సెన్సిటివ్ జోన్ కాదా?

‘గంగానది జన్మస్థానం గంగోత్రి వద్ద 150 కిలోమీటర్ల పరిధిని కేంద్రం ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించింది. దామగుండంలో ఏర్పాటు చేస్తున్న రాడార్ కేంద్రం వికారాబాద్ అడవుల్లోనే మూసీ జన్మస్థానం ఉంది. అలాంటప్పుడు మూసీ నది జన్మస్థానాన్ని ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించాలి. గంగా నదికి ఒక న్యాయం.. మూసీకి మరో న్యాయమా? రాడార్ స్టేషన్ ఏర్పాటుతో పర్యావరణ సమతుల్యతకు ప్రమాదం పొంచి ఉంది. మూసీ పేరిట రూ.వేల కోట్ల దోపిడీ చేయాలన్నదే ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. దేశ రక్షణ విషయంలో తెలంగాణ ముందు వరుసలో ఉంటుంది. కానీ జనావాసాలు లేని చోట ఏర్పాటు చేయాల్సిన రాడార్ స్టేషన్‌ను దామగుండంలో ఏర్పాటు చేయడాన్ని అంగీకరించం. పర్యావరణ వేత్తలతో కలిసి పోరాటం చేస్తాం’ అని కేటీఆర్ పేర్కొన్నారు.

నేవీ రాడార్‌కు నేడే భూమిపూజ

▶ మొదటి పేజీ తరువాయి

ఇందుకు సంబంధించిన ప్రక్రియ మొదలవగా.. ప్రస్తుతం అన్ని అనుమతులు పొంది, పనుల ప్రారంభానికి సిద్ధమైంది. దీని నిర్మాణం కోసం రిజర్వ్ ఫారెస్టులోని 2,900 ఎకరాల భూమిని నేవీకి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

అనువైన ప్రాంతం కావడంతో..

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 65 కిలోమీటర్ల దూరంలో ఉండటం, సముద్ర మట్టానికి 350 మీటర్లకుపైగా ఎత్తులో, అడవి మధ్యలో ఉండటంతో.. రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం దామగుండం ప్రాంతాన్ని నేవీ ఎంచుకుంది. ఈ రాడార్ స్టేషన్ ద్వారా దేశ తూర్పు నావికాదళం సబ్‌మెరైన్స్‌కు సంకేతాలు అందించనున్నారు. రూ.3,200 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్టు అధికారులు చెప్తున్నారు. పనుల శంకుస్థాపన ఏర్పాట్లను వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా బలగాలను మోహరించారు.

ఎన్నో ఆందోళనల మధ్య..

దామగుండంలో రాడార్ స్టేషన్ ఏర్పాటు వల్ల అటవీ ప్రాంతానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాడార్ స్టేషన్ నుంచి వెలువడే రేడియేషన్ ప్రభావంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. వేల ఎకరాల భూమిని చదును చేసే పనుల్లో అనేక రకాల వృక్షాలు, ఔషధ మొక్కలు ధ్వంసమవుతాయంటూ కొందరు ఆందోళన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. అయితే ప్రత్యామ్నాయంగా అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెబుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాడార్ స్టేషన్ ఏర్పాటుపై ముందుకు వెళ్లాయి.

రాడార్ స్టేషన్‌ను అడ్డుకుందాం..

- ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం

పంజగుట్ట (హైదరాబాద్): వికారాబాద్ జిల్లా, పూడూరు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న రాడార్ స్టేషన్ ప్రాజెక్టు కారణంగా దీర్ఘకాలిక పర్యావరణ సమస్యలతో పాటు హైదరాబాద్‌లోని వరదలను మరింత తీవ్రతరం చేస్తుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టుకోసం 2,900 ఎకరాల అటవీ భూమిని ధ్వంసం చేస్తున్నారని, సుమారు 12 లక్షల జీవవైవిధ్యం ఉన్న చెట్లను నరికేందుకు చూస్తున్నారని, యావత్ తెలంగాణ సమాజం దీన్ని అడ్డుకోవాలని వారు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల మిత్ర బృందం ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ‘దామగుండం విధ్వంసంపై పౌరసమాజం స్పందన’ అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీనియర్ పాత్రికేయుడు సంపత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పీవోడబ్ల్యూ సంధ్య, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, పృథ్వీరాజ్ యాదవ్, పర్యావరణవేత్త బాబూరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గోవర్ధన్, జర్నలిస్టులు విఠల్, తులసీచంద్, బక్క జడ్సన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు, పర్యావరణవేత్తలు నిరసన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సేవ్ దామగుండం పేరుతో దేశవ్యాప్తంగా 18 ప్రధాన పట్టణాల్లో ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

నైపుణ్యం సాధిస్తేనే విద్యార్థులకు గుర్తింపు

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాయదుర్గం: నేటి తరం గ్రాడ్యుయేట్లు అంకితభావంతో చదువుతూ ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించేందుకు కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) క్యాంపస్‌లో సోమవారం స్నాతకోత్సవాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు, సృజనాత్మకతకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ప్రతి విద్యార్థి తనకంటూ ఒక ఎదుగుదలకు కలలు కనాలని, వాటిని సార్థకం చేసుకోవడానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నర్సింహుగారి తేజ్ లోహిత్‌రెడ్డి మాట్లాడారు.

జిల్లా వార్తలు

పశువులను వెంటాడుతున్న ‘గాలికుంటు’

- పాడి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్న వ్యాధి
- క్రమం తప్పక వ్యాక్సిన్ వేయిస్తే మంచి ఫలితం
- నేటి నుంచి నవంబర్ 15 వరకు నిరోధక టీకాలు



ఆవుల మంద (ఇన్‌సెట్) గాలికుంటు వ్యాధి సోకిన పశువు

ఖమ్మంవ్యవసాయం: పశువుల్లో ఉత్పాదక శక్తి తగ్గిపోవడానికి ప్రధాన కారణం గాలికుంటు వ్యాధి అని పశువైద్య శాఖ అధికారులు చెబుతున్నారు. పాడి దిగుబడి తగ్గడమే కాక మరణాలు పెరగడానికి గాలికుంటు వ్యాధి కారణమని.. ఈ వ్యాధితో పశుగణాభివృద్ధి దెబ్బతింటోందని గుర్తించిన అధికారులు వ్యాధినివారణను జాతీయ కార్యక్రమంగా చేపట్టారు. ఈమేరకు గత కొన్నేళ్లుగా ఏటా రెండు సార్లు చొప్పున పశువులకు టీకాలు వేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నల్ల పశువులు(గేదెలు), తెల్ల పశువులు(ఆవులు) సుమారు తొమ్మిది లక్షల వరకు ఉన్నాయి. ఇందులో మూడు నెలల వయస్సు పైబడిన పశువులకు మాత్రమే టీకాలు వేస్తారు. అయితే, టీకా వేయిస్తే పశువుల్లో పాడి దిగుబడి తగ్గిపోతుందనే అపోహలు కొందరిలో ఉన్నాయి. కానీ టీకా వేశాక రెండు రోజులు దిగుబడి తగ్గినట్లు అనిపించినా.. ఆతర్వాత యథాస్థితికి చేరుతుందని పశువైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈసందర్భంగా మంగళవారం నుంచి వ్యాక్సినేషన్ మొదలవుతుండగా.. గాలికుంటు వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ, జాగ్రత్తలపై ఖమ్మం పశువైద్య రోగ నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకులు డాక్టర్ అరుణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

వ్యాధి సోకే పశువులు

గాలికుంటు వ్యాధి యుక్త వయసు ఉన్న తెల్ల, నల్ల పశువులకు సోకుతుంది. బలహీనంగా ఉండి, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న పశువుల్లో వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువ. అంతేకాక దేశవాళి పశువుల్లో కంటే సంకర జాతి పశువుల్లో ఎక్కువగా సోకుతుంది.

లక్షణాలు

శరీర ఉష్ణోగ్రత 104–106 డిగ్రీల ఫారన్ హీట్ ఉంటుంది. నోటి ఎపిథీలియం, పళ్ల చిగుళ్లు, నాలుక, ముట్టె లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడి 24 గంటల్లో చితికిపోతాయి. తద్వారా నొప్పితో పశువులు మేత మేయవు. నోటి నుంచి చొంగ కారుతుంది. గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. నొప్పి కారణంగా సరిగ్గా నడవ లేక కుంటుతుంటాయి. పొదుగుపై బొబ్బలు ఏర్పడి, పొదుగు వాపు సంభవిస్తుంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగి దూడలు మరణిస్తాయి. దుక్కిటి పశువులు పనులకు ఉపయోగపడవు. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి అకస్మాత్తుగా తగ్గుతుంది.చూలి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పశువులు రక్త హీనత కలిగి శ్వాస కష్టంగా పీలుస్తూ, రొప్పుతూ, ఎండ వేడి తట్టుకోలేక నీరసించిపోతాయి. ఈ లక్షణాలన్నీ అధికంగా సంకర జాతి పశువుల్లో ఉంటాయి.

చికిత్స

వ్యాధి సోకిన పశువులను వేరు చేసి సత్వర చికిత్స చేయించాలి. పొటాషియం పర్మాంగనేట్ నీళ్లతో పుండ్లను శుభ్రం చేసి, నోటి పుండ్లకు బోరోగ్లిజరిన్‌ను, కాలి పుండ్లకు జింక్ ఆక్సైడ్ లొరాక్సిన్, మిమాక్స్ వంటి ఆయింట్ మెంట్‌లను పూయాలి. ఈగలు వాలకుండా వేపనూనె, నిమ్లెంట్ వంటి మందుల్ని వాడాలి. మైలతుత్తం ఒకశాతం, తారుల మిశ్రమాన్ని కాలిగిట్టల సందుల్లో నింపవచ్చు. వైరస్‌పై మందులు పని చేయవు. కానీ ఆతర్వాతకలిగే అనర్థాల నివారణకుగాను యాంటీ బయోటిక్స్ 3–5 రోజులు వాడాలి. బొబ్బలతో మేత మేయని పశువులు తగు సంరక్షణ లేక మరణిస్తాయి. ఈ విషయాన్ని గుర్తించి సులభంగా జీర్ణమయ్యే పోషక పదార్థాలతో కూడిన ఆహారాన్ని అందించాలి. జావ, జొన్న, అన్నం, చిటికెడు ఉప్పు, బెల్లంతో కలిపి ప్రతిరోజు తాగిస్తే ఫలితం ఉంటుంది. మరింత బలహీనంగా ఉంటే గ్లూకోజ్ రక్తంలోకి ఇవ్వాల్సి ఉంటుంది.

నివారణ

పశువుల పుండ్లు, కలుషితమైన మేత, దాణ, నీరు మలమూత్రాదులు వాటి వల్ల వైరస్ వ్యాపిస్తుంది. పశుశాలల్లో వైరస్ క్రిములు ఏడాది వరకు దాగి ఉండి, అనుకూల పరిస్థితుల్లో వ్యాధిని కలిగిస్తాయి. పశువులశాలలను సోడియం హైడ్రాక్సైడ్ 2 శాతం ఫార్మాలిన్, 4 శాతం సోడియం కార్బోనేట్ వంటి మందులతో శుభ్రం చేయాలి. ఆంబోతులు, దున్నల వీర్యం ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన వాటిని సుమారు 3 నెలల వరకు సంపర్కానికి వినియోగించరాదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పశువులను మూడు వారాలు విడిగా ఉంచి పరిశీలించి మాత్రమే ఆరోగ్యమైన పశువుల్లో కలపాలి. వ్యాధిగ్రస్తమైన పశువుల కళేబరాలను లోతైన గొయ్యి తీసి అందులో సున్నం వేసి పాతి పెట్టాలి. లేదా కాల్చి వేయాలి. ఇతర పశువులకు వ్యాధి సోకకుండా వ్యాధిగ్రస్తమైన పశువులను దూరంగా ఉంచాలి. వ్యాధి నుంచి కోలుకున్న పశువుల్లో రొప్పడంతో పాటు గర్భస్రావాలు, పొదుగు వాపు, వంధత్వం, న్యూమోనియా, రక్తక్షీణత, గిట్టలే పోవటం వంటి దుష్ఫలితాలు ఉంటాయి.

నేటి నుంచి వ్యాక్సినేషన్



గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ మంగళవారం మొదలవుతుంది. పశుసంవర్ధక, పశువైద్య శాఖ తరపున ఇప్పటికే ఏర్పాట్లు చేశాం. ఈనెల 15 నుంచి నవంబర్ 14 వరకు కార్యక్రమం కొనసాగుతుంది. పశువైద్యశాలల పరిధిలోని అన్ని గ్రామాల్లో వ్యాక్సిన్ వేసేలా చర్యలు చేపట్టాం. పశుపోషకులు అపోహలను విడనాడి జీవాలకు వ్యాక్సిన్ వేయించాలి.

– డాక్టర్ అరుణ, సహాయ సంచాలకులు, ఖమ్మం పశువైద్య రోగ నిర్ధారణ ప్రయోగశాల

ఉత్తమ ఫలితాల సాధనపై దృష్టి

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏపీఓ డేవిడ్‌రాజ్, పక్కన అధికారులు

భద్రాచలం: దసరా సెలవులు ముగిసిన నేపథ్యాన గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వీటిని సంబంధిత అధికారులకు అందచేయగా.. అర్హతల మేరకు పరిష్కరించాలని సూచించారు. ఆతర్వాత ఏపీఓ మాట్లాడుతూ అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాలల్లో, హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తగా వ్యవహరిస్తూ మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. కాగా, చుంచుపల్లి మండలం కొత్తగూడకు చెందిన భూక్యా నరసింహ పోడు భూమికి పట్టా కోసం, ఇల్లెందు మండలం అల్లిపూర్‌కు చెందిన వెంకటేష్ కులాంతర వివాహ ప్రోత్సాహానికి, మణుగూరు మండలం సాంబయ్యగూడెంకు చెందిన 12 మంది చేపల సొసైటీ ఏర్పాటు కోసం, ఆశ్రమ పాఠశాలల ఏఎన్‌ఎంలు వేతనం ఇప్పించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు, వివిధ విభాగాల అధికారులు లక్ష్మీనారాయణ, రవీంద్రనాథ్, ఉదయ్‌కుమార్, సమ్మయ్య, హరీష్ పాల్గొన్నారు.

గిరిజన నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

భద్రాచలం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధి గిరిజన నిరుద్యోగ యువతకు భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యాన పలు అంశాల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పీఓ బి.రాహుల్ తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్, టైలరింగ్(మహిళలకు మాత్రమే), రైతులకు తేనెటీగల పెంపకంపై శిక్షణ ఉంటుందని వెల్లడించారు. టైలరింగ్‌కు ఐదో తరగతి లేదా ఆపై విద్యార్హత, బ్యూటీషియన్ కోర్సుకు ఎనిమిదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన మహిళలు, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు ఎనిమిదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన పురుషులు,తేనెటీగల పెంపకానికి ఆసక్తి కలిగి 18నంచి 35ఏళ్ల లోపు వయస్సు ఉన్న స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ జిరాక్స్, రేషన్ కార్డ్/ఉపాధి హామీ బుక్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, రెండు ఫొటోలతో ఈనెల 18న ఉదయం 9 గంటలకు భద్రాచలం ఐటీడీఏలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని పీఓ ప్రకటనలో సూచించారు.

ప్రతీ టన్ను బొగ్గుకు రూ.6వేల నష్టం

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా 24 భూగర్భగనుల్లో ప్రతీ టన్ను బొగ్గు ఉత్పత్తికి సుమారు రూ.10 వేల ఖర్చవుతుండగా.. అమ్మితే రూ.4వేలు మాత్రమే వస్తున్నాయని, తద్వారా సంస్థ ఉత్పత్తి చేసే ప్రతీ టన్నుకు రూ.6 వేల నష్టం వాటిల్లుతోందని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కొత్తగూడెంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఓపెన్‌కాస్ట్ గనుల్లో ప్రైవేట్ సంస్థలు రోజుకు సుమారు 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీస్తుండగా, సంస్థ ఆధ్వర్యాన 2లక్షల క్యూబిక్ మీటర్లు తీయడమే కష్టమవుతోందని చెప్పారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెంచకపోతే సింగరేణి మనుగడ ప్రశ్నార్థకమవుతుందనే విషయాన్ని అందరూ గుర్తించి భూగర్భగనుల్లో 100శాతం ఉత్పత్తికి సహకరించాలని సూచించారు. ఇక ఇటీవల మహిళా ఉద్యోగులు చాలామంది విధుల్లో చేరినందున అందరికీ కార్యాలయాల్లో పని కేటాయించే పరిస్థితి లేదన్నారు. ఈ మేరకు కోలిండియా నిబంధనల ప్రకారం గనుల్లోకి దిగి పని చేయకపోతే కంపెనీ మనుగడలో ముప్పు ఎదురవుతుందని తెలిపారు. సంస్థలో బొగ్గు అమ్మకాల ద్వారా కేవలం 30శాతమే లాభం వస్తుండగా, కలిసికట్టుగా పనిచేయాల్సిన బాధ్యత కార్మికులు, అధికారులపై ఉందని డైరెక్టర్ పేర్కొన్నారు. కాగా, సంస్థ ఆర్థిక స్థితిగతులపై అవగాహన కల్పించేందుకు ఈనెల 10, 11వ తేదీల్లో సమావేశాలు నిర్వహించామని, వీటి ఫలితాలు ఎలా ఉంటాయో త్వరలో తెలుస్తుందని చెప్పారు. ఇక పైరవీలు చేయిస్తున్న కార్మికులు అంకితభావంతో పనిచేసినప్పుడే అందరికీ మంచిదని డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

వరిలో తెగుళ్ల నివారణపై అవగాహన



ముదిగొండ: వరిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నేలకొండపల్లి/ముదిగొండ: నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లోని పలు గ్రామాల్లో వరి పొలాలను వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్త ఫణిశ్రీ సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఎండాకు తెగులు లక్షణాలు కనిపిస్తే పైపాటుగా నత్రజని ఎరువులు వేయడం తాత్కాలికంగా ఆపేయాలని సూచించారు. ఈ తెగులు నివారించడానికి ఎలాంటి మందులు లేనందున అప్రమత్తంగా ఉంటూ తొలిదశలోనే జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఏఓలు అరుణకుమారి, సరిత, ఏఈఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

‘సర్కిల్’ అభ్యర్థులు 53 మందికి ఉద్యోగాలు

ఖమ్మంమయూరిసెంటర్: బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ ఉచిత శిక్షణకు హాజరైన వారిలో 53 మంది ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 53 మందిలో 33 మంది ఎస్జీటీ, 20 మంది స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. ఈ సందర్భంగా అభ్యర్థులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అభినందించారని ఆమె తెలిపారు.

మినీ హైడల్ ప్రాజెక్టు కాల్వ కట్టకు ప్రమాదం

పటిష్టతపై ఇప్పటికీ స్పందించని జెన్‌కో



ప్రాజెక్టు కాల్వ కట్టను మట్టితో పటిష్టం చేయిస్తున్న దృశ్యం

కూసుమంచి: మండలంలోని పాలేరులో మినీ హైడల్ ప్రాజెక్టు(జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం)కు రిజర్వాయర్ నుండి నీరు సరఫరా చేసే కాల్వ కట్టకు ప్రమాదం పొంచి ఉంది. గత నెలలో వచ్చిన భారీ వరదలతో కాల్వ కట్ట తెగి నీరంతా ఎడమ కాల్వలోకి చేరడంతో కాల్వకు కూడా గండ్లు పడిన విషయం విదితమే. దీంతో ఎడమ కాల్వ కట్టలకు పడిన గండ్లు పూడ్చే క్రమాన జలవనరుల శాఖ అధికారులు మినీ హైడల్ ప్రాజెక్టు కాల్వ కట్ట గండ్లను కూడా మట్టితో నింపి తాత్కాలికంగా పూడ్చివేశారు. అయితే, కట్టను జెన్‌కో సంస్థ ఆధ్వర్యాన పూర్తిస్థాయిలో పటిష్టపర్చాల్సి ఉండగా నేటికీ టెండర్లు ఖరారు కాలేదు. దీంతో ఎగువన వర్షాలు కురుస్తుండటం, సాగర్ జలాల చేరికతో రిజర్వాయర్ నీటిమట్టం 20 అడుగులు దాటడంతో మినీ హైడల్ ప్రాజెక్టు కాల్వ నిండా నీటితో ప్రవహిస్తోంది. దీంతో కట్టకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యాన సోమవారం జలవనరులశాఖ అధికారులే కాల్వ కట్టపైకి మట్టి తరలించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇకనైనా జెన్‌కో అధికారులు స్పందించి పనుల టెండర్లు ఖరారు చేయాలని పలువురు కోరుతున్నారు.